


# మనిషి - మనసు

— అన్నంరాజు . జి. రాం

"ఇదే మీ సీటు. వీరు రఘునాధరావు గారని మీ ప్రిడిసిసర్, వారే మీకు ఈ ఫైల్సు అన్నీ హేండోవర్ చేస్తారు. మీకు ఏదైనా తెలియకపోతే నన్ను అడగండి చెబుతాను" అంటూ సీటు వద్దకు తీసుకొనివెళ్ళి కళ్ళుమూసుకొని పాఠం వప్పగించినట్లుగా అనేసి, అక్కడ కూర్చునిఉన్న అతనితో "మిస్టర్ రఘునాధరావు వీరు మాధవరావుగారని కామర్సు గ్రాడ్యుయేట్ కొత్తగా అపాయింట్ అయ్యారు. ఈ సీటు వారికి పరిచయంచేయండి" అని చెప్పి తనపని ముగిసినట్లుగా తన సీటు వద్దకు వెళ్ళిపోయారు ఎకౌంటెంట్.

మాధవరావు తలఎత్తి నాలుగు వైపు లకూ పరికించి చూచేడు. విశాలమైన హాలులో బారులు తీర్చిన టేబుల్సు ముందు గుమాస్తాలనదగ్గ ప్రాణులు ఫైళ్ళ గుట్టలలో మునిగిపోయి కాలంతో తమకు నిమిత్తం లేనట్లుగా యధాశక్తి ప్రభుత్వానికి సేవచేస్తున్నారు. అందరి తలలూ ఒక్కసారిగా మాధవరావు వైపు తిరిగి ఆపాదమస్తకం పరీక్ష చేస్తున్నాయి 'జూ'లోకి కొత్తగా వచ్చిన జంతువును చూచినట్లు. కొందరు ఫైళ్ళతో కుస్తీ పడుతున్నారు. మరికొందరు లేడీ టైపిస్టులకేసి, మెరపుతీగల్లా కదులుతున్న వాళ్ళ వేళ్ళ సౌందర్యాన్ని తిలకిస్తున్నారు. మాధవరావుకి ఇదంతా అయోమయ ప్రపంచంలాగ కనపడ సాగింది.

"ఇది పర్చేజ్ ఎకౌంటుసీటు........" అని చెబుతున్న రఘునాధరావు మాటలతో ఈ ప్రపంచంలోకి వచ్చాడు మాధవరావు..........మీరు మైన్‌టైన్ చేయవలసిన ఫైళ్ళు ఇవి. కొత్తలో కొంచెం చికాకుగా ఉన్నా క్రమంగా తెలుస్తుంది లెండి" అని చెప్పుకు పోతున్నాడు రఘునాధరావు ఇన్నాల్టికి తనకు ఈపీడ విరగడైందిగదా అని సంతోషించుతూ.

మాధవ్ అయోమయంగా ఫైల్సు కేసి చూచి తరువాత రఘునాధరావు కేసి చూడ సాగాడు ఏమీ అంతుబట్టక. కానీ ఇదంతా ఏమీ పట్టించుకునే స్థితిలో లేడు రఘునాధరావు. అతడు తనధోరణిలో ఇంకా చెబుతూనే "ఇది డైరీ ప్రతిరోజూ మీరు చేసినపని దీనిలో వ్రాసి నాలుగు గంటలకల్లా ఆఫీసరు టేబులుపైన పెట్టాలి" అంటూ ముగించాడు.

"నాకేమి అర్థం గావటంలేదండీ" అంటున్న మాధవరావుకేసి చూసి "నాకు మాత్రం మొదట్లో అర్థమైందనా! ఏదో చూస్తూంటే అవే అర్థమవుతాయి. చూడండి మీరు పనిచేసినా, చెయ్యక పోయినా ఏదో పని చేసినట్లు వ్రాసి ఆ ప్రోగ్రెస్‌రిపోర్టు మాత్రం ప్రతిదినం సాయంకాలం నాలుగుగంటలకి ఆఫీసరు దగ్గరకి పంపిస్తూ ఉండండి" అన్నాడు. అనుభవజ్ఞుడైనట్లుగా ఎన్నాళ్ళ నుండో ఎదురు చూచిన ప్రమోషను గగన కుసుమమై పోగా కనీసం ఇంకొక సెక్షనుకైనా మారుతున్నాం గదా అన్న సంతోషంతో రఘునాధరావు.

• • •

"రాధా కొత్తగా అపాయింటయిన ఆయన అదేమిటే బొత్తిగా అలా 'దేవదాసులా' ఉంటాడు. ఎప్పుడు చూచినా ఏదో పోగొట్టుకున్న వానిలా దిగులుగా ఉంటాడేమిటి?. అంటూ వయ్యారం అంతా ఒలకపోసింది టైపిస్టు వసంత వారంరోజులుగా చూస్తున్నా అతని తత్వం అంత బట్టక.

"పాపం, ఆడవాళ్ళంటే భయమేమో!" అన్నది 'వీక్లీ' చూస్తూ రాధారాణి.

"కాదులేవోయ్! అందగాణ్ణని గర్వమేమోననుకుంటా; లేకపోతే ఒక మాటా లేదు మంచీలేదు. పోనీ నీవన్నట్లు ప్రవరాఖ్యుడే ననుకుందాం! కనీసం పక్క సీటువాళ్ళు రంగనాథంతో గానీ, ముకుందంతోగానీ ఎప్పుడైనా ఒక్క

మా పైనా మాట్లాడినట్లు చూశావా!" అంటూ తన తాపత్రయం అంతా వెళ్ళబోసుకుంది తనో పెద్ద అయస్కాంతాన్నని గర్విస్తున్న నందిని.

"అతను అందరిలాంటి వాడు కాదేమో! అయినా మీకు ఎప్పుడు చూసినా అతిని గొడవే ఎందుకు?" అంటూ విసుక్కుంది రాధారాణి.

బొత్తిగా అతిని పక్షపాతి వై పోయావేమిటి!" సన్నాయి నొక్కులు నొక్కింది వసంత.

"'లవ్ ఎట్ ఫస్టు సైట్' లాగా ప్రథమ వీక్షణంలోనే కొంపదీసి ప్రేమించలేదు కదా రాధా!" అంటూ పరిహాస మాడింది నందిని,

"అబ్బబ్బ, అసలు మనకున్న 'లంచ్ టైం' అర్థగంట. ఈ కాసేపట్లో ఎంతసేపూ అతని గొడవేనా, ఎవరెట్లా పోతే మనకెందుకు? మన సంగతి మనం చూచుకోక. మీరు ఇక ఆ ప్రస్తావన మానకపోతే నేను లేచి సీటులోకి వెళ్ళిపోతున్నా" నంటూ లేచి పోయింది రాధారాణి. వెనుకనుండి నందిని, వసంత పిలుస్తున్నా వినిపించుకోకుండా!

"చూడండి ఈ మెమొరాండంను టైపు చేసి ఇవ్వండి అర్జంటుగా! ఇది ఈ రోజే డిస్పాచ్ కావాలి" అంటూ రాధారాణి వైపు కనీసం తలఎత్తయినా చూడకుండా తన సీటుకి వెళ్ళిపోయాడు మాధవరావు.

మాధవ్ తలవంచుకొని ఏదో వ్రాసుకుంటున్నాడు.

మిమ్మల్ని ఆఫీసరుగారు రమ్మంటున్నారు" అంటూ వచ్చాడు ఆఫీసుప్యూను అప్పలస్వామి.

"పాపం అసలేకొత్తవాడు. అతి మెత్తని స్వభావంలాగుంది. మనదూర్వాసులవారి చేతిలో దీవనలు ప్రారంభం అవుతాయికాబోలు" అంటున్న ముకుందం మాటలు వింటూ తలవంచుకొని వెళ్ళిపోయాడు మాధవ్. స్ప్రింగ్‌డోర్సు తీసుకొని లోపలికి వెళ్ళి వినయంగా ఆఫీసరు ఎదట నుంచొని 'విష్' చేసేడు.

"రావోయ్! రా! మాధవరావంటే నీవేకదూ! వారంరోజులక్రితం జేరింది! పని ఎలాఉంది? అంటూ వాత్సల్య పూరితంగా అడిగేడు.

"ఫరవాలేదుసార్...."

"నీకు ఏమైనా తెలియనివుంటే నేరుగా నాదగ్గరకురా! నేను చెబుతాను" అని ఆఫీసరు అంటుంటే ఈ అకారణ వాత్సల్యానికి కారణమేమిటి? అనుకుంటూ విస్తుబోతుండగా మళ్ళీ ఆఫీసరు "ఆఁ.....చూడూ..... కోదండరామయ్య గారు నీకు తెలుసా?ఆయనేమవుతారు?" అన్నాడు అర్ధోక్తిలో.

ఆ మాటతో సర్వం అర్థమైంది మాధవ్‌కు. "ఓహో! ఇదాకారణం" అనుకుంటూనే "తెలుసండి, మా నాన్నగారికి స్నేహితులు. మాఊళ్ళో పనిచేసినపుడు మావీధిలో మాయింటికి ఎదురుగా ఉండేవారు."

"సరే; ఎక్కడ ఉంటున్నావు? ఇక్కడ ఉండటానికి ఇల్లుదొరకవు తొందరగా!"

"నా స్నేహితుడొకడు యూనివర్శి

టీలో చదువుతూ ఇక్కడే వున్నాడు. అతనిగదిలో ఉంటున్నానండి ప్రస్తుతం."

"నీకు అంతగా ఇబ్బందైతే మా మేడమీదగది కాళీగానేవుంది అందులో జేరు. నీవేం మొగమాటం పడబోకు. కోదండరామయ్యగారు నాకు చాలా ముఖ్యులు. బంధువులుకూడాను. ఆయన మొన్ననే వ్రాశారులే నీవు చాలా మొగ మాటస్థుడవనీ. భిడియస్థుడవనీ. సిగ్గు పడతావనీ...."

"ఎందుకుసార్; మీకంతశ్రమ. నాకేం ఇబ్బందిలేదు" అంటూ బయటకువచ్చాడు మాధవ్.

అప్పలస్వామి తన చెవులను తానే నమ్మలేకపోయాడు. దూర్వాస, విశ్వామిత్రులకు రూపాంతరమైన ఆఫీసరు నోటివెంట ఎప్పుడూ ఇంత నిదానమైన మాటలు రాకపోవటంవలన తానేదో భ్రమలో ఉన్నానని గిల్లిచూచుకొని స్వప్నంకాదు. ఇది వాస్తవమే అని ఆశ్చర్యపోయాడు. నిముషాలమీద మాధవ్ ఆఫీసరుకు బంధువని, ఆయనింట్లో ఉండబోతున్నాడనీ వార్త పాదరసంలా ప్రాకింది. ఇందాక తాను అన్నమాటలు ఆఫీసరుతో చెప్పేదేమోనని ముకుందం మొగం ముడుచుకున్నాడు. రంగనాథం ప్రభృతులు మాధవ్ చుట్టూ చేరారు.

"ఆఫీసరు మీకు బంధువటగా! ఇకనుండి వారింట్లోనేనా మీ మకాం! అసలు ఆయనేనటగా అపాయింట్‌మెంట్ ఆర్డర్సు వేయించింది."

ప్రమోషను త్వరలోనే రావచ్చు మీకు! అందరిలాగా గుమాస్తాగా రిటైర వనక్కరలేదు. ఏదో ఒక అండలేనిదే ఈరోజులలో పైకిరావటం కష్టం" అంటూ తన మనసులోని అక్కసువెళ్ళగ్రక్కారు వెండికొండలాగా సగం తల నెరిసి గుమాస్తాగానే రిటైరవబోతున్న ఒక అనామకరావు.

మాధవ్‌కు ఇదంతా చిత్రంగాతోచింది. నిన్నటివరకు తనతో మాట్లాడనివాళ్ళు కూడ ఏదోవిధంగా తనతో పరిచయం చేసుకుంటున్నారు.

"చూడండి నేనుజేరి వారం పది రోజులు కాలేదుసరిగా! ఇంతవరకు పర్మినెంటేకాలేదు. అప్పుడే మీరేదో ప్రమోషను అంటున్నారు. నాకన్న సీనియర్లు ఎంతోమంది ఉన్నారు వాళ్ళకు రాకుండా నాకుఎలావస్తుందండి?" అంటుండగానె ముకుందం.

"ఆఫీసరు మీకు బంధువుగా...." అని కుతూహలంగా ఏదోచెప్పబోతుండగా...

"అని మీకు ఎవరుచెప్పారు ?" మాధవ్ అడ్డుతగిలేసరికి ముకుందం విస్తుబోయి "అదేమిటండీ. ఆఫీసులో అంతా అనుకుంటుంటే అన్నాను. లేకపోతే నాకేం తెలుసూ" అంటూ అప్పలస్వామి కేసి చూచేడు.

మాధవ్‌కి ఈ వాతావరణమంతా కృత్రిమంగా తోచింది. నిన్నటి దాకా ఆసంగతి వీళ్ళెవరికి పట్టలేదు. ఇప్పుడు ఆఫీసరు ఏదో పిలిచి తన గురించి యోగక్షేమాలడిగేవరకు వీళ్ళంతా దానికి లేనిపోనివేవో కల్పించుకొని ఊహాగానాలు చేయటం, అసభ్యంగా ప్రశ్నిం

చదం ఏమీ నచ్చలేదు. ఎలాగో తమాయించుకొని.

"ఆయన నాకు బంధువూకాదు. ఈ ఉద్యోగమూ ఇప్పించలేదు. మీరు లేనిపోనివేవో ఊహించుకుంటే నేను చెప్పగలిగేదేమీలేదు. అసలు ఆఫీసరు ఇపుడు నన్ను పిలిచి అడిగిందాకా నాకూ తెలియదు. మా నాన్నగారి స్నేహితుడు ఆయనకు బంధువట" అన్నాడు మాధవ్ కొంత అనుకోని తీవ్రతతో. అంత మెత్తగాఉండే మనిషి ఆ విధంగా మాట్లాడటంతో అంతా విస్తుబోయారు.

సాయంత్రం అయిదుగంటలకు మాధవ్ ఈ వాతావరణంనుండి బయటపడి గదికి చేరుకున్నాడు. అప్పటికే యూనివర్శిటీనుండి వచ్చిన చక్రపాణి స్నానంచేసి ముస్తాబవుతూ మాధవ్‌ని చూచి "ఏరా! ఎలాఉంది కొత్త ఉద్యోగనుభవం" అంటూ వెనుదిరిగి "అరె, అదేమిటి అలా ఉన్నావ్? ఒంట్లో బాగాలేదా?" అంటూ దగ్గరకొచ్చి చెయ్యి పట్టుకున్నాడు.

"అబ్బె, ఏంలేదురా!" అంటూ తప్పించుకోజూచాడు మాధవ్.

"లేదంటే ఎలా! నీ ముఖమే చెబుతుంది ఏదో జరిగినట్లుగా. ఇంతకీ ఆఫీసరేమైనా...." అంటూ ఆగిపోయాడు చక్రపాణి, ఇక మాధవ్‌కి జరిగిన విషయం చెప్పక తప్పలేదు.

"ఓస్! ఇంతేనా! నేను ఇంకేదో ననుకున్నాను, సహజంగా అధికారి బంధువనగానే వాళ్ళు నీవేదో పొంగిపోతావని అలా అనిఉంటారు. ఇదేరా భాయ్! లోకమంటే! డబ్బు. ఇన్‌ఫ్లుయన్సు ఉంటేచాలు నీ చుట్టూ చక్కెర్లు కొడుతుంది. లేకుంటే నీవెంత గొప్పవాడివైనా నీ ముఖం చూడదు. సర్లే దానికేంగానీ త్వరగా స్నానంచేసి బయల్దేరు."

"ఎక్కడికి? ఎందుకు?" అని ప్రశ్నించబోతున్న మాధవ్‌నుచూసి

"నీ ప్రశ్నలు తరువాత ముందు త్వరగా తయారవు" సిగరెట్లు తెచ్చుకోవటానికి బయటికి వెళ్ళాడు చక్రపాణి.

◆ ◆ ◆

మాధవరావు, చక్రపాణి మోటారు సైకిల్‌మీద బయలుదేరి ఒక అత్యాధునికమైన బంగళాముందు ఆగారు. "రారా మాధవ్! ఇది మా మామయ్యాగారిల్లు. ఆయన రిటైర్డు గజిటెడ్ ఆఫీసరు." అంటూ లోపలికిపోయాడు. మాధవ్ ఆతనిని అనుసరించి లోపలికి వెళ్ళి చుట్టూ పరిశీలిస్తున్నాడు. ఇంటి చుట్టూ కాంపౌండ్, ప్రహరీకి లోపలివైపు కొబ్బరిచెట్లు, చక్కని పూలచెట్లు, వరండా కిరువైపులా మాలతీమాధవం, నైట్‌క్వీన్ తీగెలు పైకి అల్లుకొని మనోహరంగా ఊగుతున్నాయి ఇంటికి వచ్చేవారికి స్వాగతం చెబుతున్నట్లుగా! లోపల విశాలమైన హాలు, ఆధునికమైన ఫర్నిచర్‌తో తీర్చిదిద్దినట్లుగా అలంకరించబడిఉంది.

"ఏమండోయ్! మిమ్మల్నే! ఏమిటలా వింతగా చూస్తున్నారు? మా ఇల్లు ఏమీ బాగాలేదా! నిల్చునే ఉన్నారేం? కూర్చోండి." అన్న మధురమైన కంఠ

ధ్వని వినిపించిన వైపుకు చూచాడు. ఆశ్చర్యం! తన కళ్ళని తానే నమ్మలేక పోయాడు.

"ఏమిటండీ అలా చూస్తారు? కూర్చోమంటేకూర్చోరేం? నామాటలు వినిపించడంలేదా!" అంటున్న రాధారాణిమాటలకు సిగ్గుపడి ఒకపేము కుర్చీలో కూర్చున్నాడు.

"ఏమిటి రాణీ! మరీ మావాడివి ఆటలు పట్టించేస్తున్నావు. వాడు అసలే నోరు లేనివాడు. వాడికి మొగవాళ్ళని చూస్తేనే సిగ్గు! నీవేదో ఆడించేసున్నావల్లె ఉందే" అంటూ మేడమీద నుండి హాలులోకి వస్తున్న పాణి మాటల్తో పూర్తిగా ప్రపంచంలోకి వచ్చాడు ఇంత సేపటినుండి తను పరిసరాలను గమనించకుండా ఇంటి వాతావరణాన్ని చూస్తూ ముగ్ధుడైపోయాడు. తన అనుచిత ప్రవర్తనకు సిగ్గుపడుతుంటే

"ఏమిటోయ్! అలా సిగ్గుపడుతావు ఆడపిల్లలాగా! అయినా ఈరోజుల్లో ఆడవాళ్ళకే లేని సిగ్గు నీకెందుకోయ్" అంటున్న పాణికేసి చురచురా చూచింది రాధారాణి.

"ఆఁ.... అన్నట్లు పరిచయం చేయటం మరచాను. చూడు మాధవ్ ఈమె మిస్. రాధారాణి, బి.య్యే. మా మామయ్యగారి గారాలపట్టి ఏకైక పుత్రిక హాబీగా ఉద్యోగం చేస్తున్నది. అదేమంటే ఇంట్లో కూర్చుంటే ఏమీ తోచదంటుంది. చదివినందుకు చదువు సార్థకం చేసుకోవాలి. ఉద్యోగం చేసేది కేవలం డబ్బు కోసమే కాదు అనే ఉన్నత భావాలుగల సనాతన.... సారీ.... ఆధునిక యువతీ మణి"

"ఏమిటిబావా! నీవు మరీను" అంటూ చిరుకోపం ప్రదర్శించింది.

"అన్నట్లు అసలువిషయం మరచాను ఈమే 'దేవీప్రసన్న' అనే పెన్‌నేమ్‌తో సాహిత్య విమర్శ చేస్తూ ఉంటుంది. గొప్ప విమర్శకుడులే" రాధారాణి పకపకా నవ్వుతుంటే తను పప్పులో కాలేసినట్లు గ్రహించి "అయామ్ సారీ! విమర్శకురాలు" అంటూ తను కూడ ఆమె నవ్వులో శృతి కలిపాడు పాణి.

"ఇకవీడు.... కాదు.... కాదు.... వీరు....."

"మాధవరావు గారని ఈ ఊళ్ళోనే మా ఆఫీసులోనే ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం నీ రూమ్ మేటు" అవునా అన్నట్లు పూర్తి చేసింది రాధారాణి. ఆశ్చర్యపోయాడు చక్రపాణి.

"మరినాకు చెప్పలేదేంరా" అంటున్న పాణిని చూస్తూ,

"బాగుంది. నాకేంతెలుసూ! నీవు ఇప్పుడు చెప్పేవరకు...." అంటున్న మాధవ్ మాటలు పట్టించుకోకుండా

"రాణీ మావాడి గురించి నీకు అంతే తెలుసన్నమాట. వీడు మంచి కధా రచయిత. నీవు ఎప్పుడూ చదవలేదా వీడి కధలూ, సీరియల్సు వారపత్రికలలో పడుతుంటాయి తరచుగా! అంతెకాదు.."

"సరేలేవోయ్! పెద్ద కోతలు కోస్తున్నావు గానీ, ఇంతకీ నీవు ఇక్కడికి వచ్చింది మీమామయ్య గారిని కలుసుకోవాలనేనా! ఏదీ నీకు ఆ ధ్యాసే ఉన్నట్లు కన్పించదు" అంటూ మాట తప్పించ

జూచాడు మాధవ్.

అవును గానీ రాణీ! మామయ్య ఎక్కడా కన్పించలేం! నిన్న సాయత్రం రమ్మని కబురు చేసారట ఎందుకు?"

"మధ్యాహ్నమే ఊరికి వెళ్ళారుబావా! బహుశ రేపు వస్తారేమో! ఉండండి ఇప్పుడేవస్తా!" అంటూ లోపలికి పోయి అయిదునిమిషాలలో కాఫీ తీసుకొనివచ్చి అక్కడ పెట్టింది.

"మావాడికి కా,ఫీ టీ. సిగరెట్, ఇత్యాది అలవాట్లేమీ లేవమ్మాయ్! పండ్ల రసంగానీ, చిక్కనిమజ్జిగగానీ పుచ్చుకుంటాడు. అంతేకానీ కనీసం వక్కపొడి వేసుకునే అలవాటైనాలేదు" అంటూ మిత్రుడిని ఎగతాళి పట్టించాడు పాణి హాస్యధోరణిలో.

"వారినిచూచి మీవు నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయిబావా! సిగ్గుపడాలి గానీ ఎగతాళి చేస్తావేం?" అంటున్న రాణి మాటలకు గతుక్కుమన్నాడు పాణి.

"అరెరె! ఎక్కడికిపోయినా నీవే ఫస్టు మార్కులు కొట్టేస్తున్నావురా" అంటూ సిగరెట్ తీసి ముటించబోయి రాధా రాణినిచూచి వెంటనే జేబులోపెట్టుకున్నాడు. మాట్లాడుతూ ఉండండి అత్తయ్య దగ్గరకువెళ్ళి కనపడివస్తానంటూ అక్కడనుండి వంటగదివైపు వెళ్ళాడు పాణి.

"దీవపాళి కథలపోటీకి ఏమైనా వ్రాశారా?"

"లేదండీ"

"ఏం! ఎందుకుమానేశారు? ఇప్పుడు ప్రచురితమౌతున్న మీ సీరియల్ "అంతర్వాణి"లో కథానాయిక 'రాధిక' పాత్రపోషణ చాలాబాగుంది. నవల సుఖాంతమా దుఃఖాంతమా!"

"ఎలాగైతే బాగుంటుందని మీ ఉద్దేశ్యం"

"సుఖాంతమే! నేను ట్రాజెడీలను భరించలేను"

"ఏమిటి రాణీ! ట్రాజెడీ, కామెడీ లంటూ చర్చిస్తున్నారు" అంటూ వచ్చిన పాణితో.

"ఇక పోదామా" అంటూ లేచాడు మాధవ్,

"మామయ్య వచ్చాక నేను వచ్చి వెళ్ళానని చెప్పురాణీ" అంటూ మిత్రునితో కలిసి నిష్క్రమించాడు.

• • •

"యువర్ స్టోరీ హాజ్‌బీన్ అవార్డెడ్ విత్ ఫస్టుప్రైజ్, కంగ్రాచ్యులేషన్స్" అన్న టెలిగ్రాంతో ఆఫీసులో అందరికి తెలిసి పోయింది మాధవ్ రచయితని. అంతా అభినందనలు తెలిపారు. మధ్యాహ్నం లంచ్‌టైంలో రంగనాధం అప్పలస్వామిని పిలిచి మాధవ్‌కి సాల్యూట్ చెయ్యమన్నాడు. అప్పలస్వామి మిలటరీ సాల్యూట్ చేసి "చెప్పండిసార్, ఎన్ని కాఫీలు?" అన్నాడు అతివినయంగా అటెన్షన్ పొజిషన్‌లో నిలబడి. మాధవ్‌కీ తతంగమంతా తమాషాగా తోచింది. ప్రతిఘనికి వ్యతిరేకిస్తే బాగుండదని "సరే, మనసెక్షనుకు కాఫీలు పట్టుకురా!" అని డబ్బుఇచ్చాడు.

అంతా కాఫీలు తీసుకుంటుండగా "మీరు తీసుకోరేం?" అంటూ పరామ

ర్శించాడు ఎక్కౌంటెంట్. "నాకు అలవాటులేదుసార్" అన్న మాధవ్ మాటలకు "అరె చిత్రంగాఉందే! కాఫీ అలవాటేలేదామీకు! ఈరోజుల్లో కాఫీ తాగనివాళ్ళెవరంటే" అంటూ అదో పుష్పమైన విషయంలా అడిగాడు ఎక్కౌంటెంట్.

"చూచావా రాధా! మాధవరావుగారు కథయితలు. ఆకోడా వేమ చెబితే విన్నావా! వింతమనిషివి...." అంటూ ఏదో చెప్పబోతున్న వసంత మాటలు వినిపించుకోకుండా మాధవ్ దగ్గరకు వెళ్ళి "కంగ్రాచ్యులేషన్స్! మాధవరావుగారూ. దీపావళి కథలపోటీలో మీకు ఫస్టుప్రైజ్ వచ్చిందటగా" అంటూ అభినందనలు తెలిపింది.

"థాంక్స్"

"సాయంత్రం రవీంద్ర భారతిలో 'చండాలిక' వైజయంతిమాల నృత్య నాటిక ఉన్నది—బావ, మీరు రెడీగా ఉండండి, నేను కారు తీసుకవస్తాను."

"ఎందుకండీ మీకు శ్రమ."

"అదేమిటండీ అలా అంటారు! వెయ్యిరూపాయలు మొదటి బహుమతి కొట్టేసి. అసలు ఈరోజు ఖర్చంతా మీదే. అలాంటిది ఈ సంతోష సమయంలో నేను, బావ కలిసి అరేంజ్ చేసే దానికయినా సమ్మతించక పీనాసిలా మాటాడుతారేం?"

"సరే మీ యిష్టం" అన్నాడు మాధవ్.

* * *

"ఏమండీ మీ ముస్తాబు ఇంకా కాలేదా! టైమయిపోతున్నది. త్వరగా తెమలండి. మూడు టిక్కెట్లు బుక్ చేశాను." అంటూ లోపలికి వచ్చిన రాధారాణి మాధవ్‌నిచూచి "బావఏడీ! ఇంకా రాలేదా!" అంటూ కుర్చీలో కూర్చుంది,

"లేదండీ! రోజూ ఈపాటికే వచ్చే వాడు."

"సరే, మనం పోదాం పదండి. ఆయనతో పెట్టుకుంటే ఇక అయినట్లే"

"........."

"ఏం! సందేహిస్తున్నారు?"

"ఏంలేదండీ! పాణికూడాఉంటే సరదాగా ఉండేది."

"అక్కడికీనేను ఆఫీసు నుండి ఫోన్ చేశాను సాయంత్రం త్వరగా రమ్మని, ఆయనగారికి ఫ్రెండ్స్‌తోనే లోకం! ఇక మనమెక్కడ గుర్తుంటాం లెండి. వస్తే తరువాత లేట్‌గా వస్తాడు. మీరు లేవండి."

రవీంద్ర భారతిలో ముందువరస మెత్తని ముఖమల్ కుర్చీలలో రాధారాణి ప్రక్కన కూర్చోవటానికి ఇబ్బంది పడ్డాడు మాధవ్. ప్రదర్శన జరుగుతుండగా రెండు మూడుసార్లు అప్రయత్నంగా రాధారాణి కాళ్ళు మాధవ్ కాళ్ళను మెత్తగా పలుకరించినాయి.

ప్రదర్శనానంతరం బయటకువస్తూ "హలో! బావా!" అంటూ పిలచిన రాధారాణివేపు చూడకుండా జనంలో కలిసిపోయాడు చక్రపాణి.

"మీబావ కనుపించాడా రాధారాణీ"

"అవును. పిల్చినా వినిపించుకో

కుండా వెళ్ళాడు. బహుశ ప్రదర్శన మొదలైన తరువాత వచ్చేడేమో!"

"మీ కేక వినిపించలేదేమో!"

మాధవ్, రాధారాణి కారులో ఎక్కారు. మాధవ్ గది చేరేసరికి పది గంటలైంది. లైటువేసి చూస్తే చక్రపాణి ముసుగుతన్ని పడుకొని ఉన్నాడు.

"పాణీ! నిద్రపోతున్నావా!"

"అవునురా! తలనొప్పిగా ఉంది."

"రవీంద్ర భారతికి వచ్చావా ?"

"ఆఁ నేను వచ్చేసరికి ప్రదర్శన మొదలైంది, మీరెక్కడా కనుపించ లేదు, కాసేపుచూచి తలనొప్పిగా ఉంటే వచ్చేశాను, ఇంతకీ ప్రదర్శన ఎలా ఉంది?"

"అద్భుతంగా ఉంది, ప్రక్కన నీవు లేవన్న కొంత ఒక్కటి తప్పితే...."

"సరే పడుకో ప్రొద్దుపోయింది" అంటూ అటు తిరిగాడు చక్రపాణి.

* * *

"అత్తయ్యా ! రాణి ఎక్కడ ?" అంటూ వచ్చాడు చక్రపాణి.

నీ దగ్గరకే వచ్చింది నాయనా ! ఏదో సినిమాకు రమ్మన్నారటగా" అన్నది పార్వతమ్మగారు.

"ఓహో! మా గదికి వెళ్ళిందేమో ! నేను యూనివర్శిటీనుండి ఇటేవచ్చాను. వస్తానత్తయ్యా!" అంటూ మోటారు బైకు స్టార్టు చేశాడు పాణి.

గదికి గాడ్రెజ్‌లాక్ ఊగుతూ వెక్కిరించింది. సాయంత్రం తనని త్వరగా రమ్మనిచెప్పిన రాణిఎక్కడకువెళ్ళింది? 'లైట్ హవుసులో' సోఫియా లారెన్ పిక్చరు ఈరోజే రిలీజ్ తప్పక రావాలి బావా ! మొన్నటిలా లేట్ చేయకు. నికోసం వెయిట్ చేస్తూంటానన్న మనిషి ఒక్కతే వెళ్ళిందా! ఏమో రాణి ఒక్కతే వెళ్ళిందేమో ! 'సోఫియా' అంటే రాణికి తగని పిచ్చి. తను వచ్చేసరికి లేటవుతుందని వెళ్ళిందేమో నను కుంటూ బైక్‌స్టార్టు చేశాడు పాణి.

ఇంటర్‌వెల్‌లో చూచాడు ప్రక్కనే ఉన్న బాక్సులో రాధారాణి మాధవ్‌లు. ఇక అక్కడ కూర్చోలేక బయటికి వచ్చేశాడు. చక్రపాణి మనసులో భావ తరంగాలు చక్రభ్రమణంలా పరిభ్రమిస్తున్నాయి, ఎంత సరిపెట్టుకో చూచినా మనసు కుదుటపడటంలేదు, కళ్ళు మూసుకొని పడుకున్నాడు. మాధవ్‌వచ్చి పలుకరించినా పలుకలేదు. నిద్రగా ఉన్నాడని మాధవ్ మరి పలుకరించకుండా లైట్ ఆఫ్ చేశాడు.

o o o

"మాధవ్ సాయంకాలం ఆఫీసు నుంచి త్వరగా వస్తావా!"

"ఏం! ఏదైనా పనిఉందా?"

"అవును. నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి."

"ఏమిటి ?"

"సాయంత్రం నాలుగింటికి వచ్చేయి. నేనుకూడా యూనివర్శిటీనుంచి అర్లీగా వస్తాను. అలా నౌబత్‌పహాడ్‌కేసి వెళదాం."

"అలాగే"

సాయంత్రం అయిదుగంటలకి మాధవ్, చక్రపాణిలు 'గోపీ'నుండి

వొబత్ – పహాడ్‌కేసి బయలు దేరారు. అక్కడనుండి క్రిందకు చూస్తుంటే నగర మంతా పచ్చగా కనపడుతుంది. విశాల మైన రోడ్లుమీదుగా కార్లు ఎడతెరిపి లేకుండా పోతున్నాయి. వా రిద్దరిమధ్య మౌనం రాజ్యం చేస్తున్నది.

"పాణీ, ఏదో మాట్లాడాలన్నావు ?"

"ఊఁ ....."

"ఏమిటీఆలోచిస్తున్నావు ? ఈ మధ్య పూర్వంలా ఉత్సాహంగా ఉండటం లేదేం ? ఏమైనా జరిగిందా ? "

చక్రపాణి మౌనంగా 'గోల్డుఫ్లాక్' సిగరెట్ తీసి ముట్టించేడు.

"పాణి మాట్లాడవేంరా?"

"ఏం మాట్లాడమంటావురా నీవుచేసే పనికి ? మాధవ్ నీవు ఇంత మిత్ర ద్రోహానికి, ఆత్మవంచనకి పాల్పడుతా వనుకోలేదురా."

"పాణి ఏమిటి నీవు మాట్లాడు తున్నది?"

"ఏం ? ఆశ్చర్యంగా ఉన్నదా ? నీవు చేసేపనికి నేను ఎంతబాధ పడుతున్నానో తెలుసా? మిత్రుడివి, ఇబ్బందుల్లో ఉన్నా వని ఆదరించి చేరదీసి నందుకు నాకే ఎసరు పెడతావనుకోలేదు. అవునులే! అవునులే! అసలు నిన్నని ఏం ప్రయో జనం. మనబంగారం మంచిగానప్పుడు"

"పాణీ!"

"ఎందుకురా ఇంకా గొంతుచించు కుంటావు ? రాణి పుట్టినప్పటినుండి నా భార్యగానే మా వాళ్ళ చేత నిర్ణయించ బడింది. దానికి తగ్గట్టుగానే మొన్న మొన్నటి వరకు నాతోనే లోకమనీ, నేనే దేవుడనీ, తన సర్వస్వమనీ భావిం చింది. మా దేహాలు వేరైనా ప్రాణాలు ఒక్కటిగానే జీవించుతున్నాం. ప్రాణా నికి ప్రాణంగా గౌరవించే స్నేహితుడివి నన్ను ఇంత అవమాన పరుస్తావా !"

మాధవ్ దిగ్భ్రాంతుడయ్యేడు.

"మాధవ్! ఒకవిధంగాచూస్తేనిన్నన వలసిన పని లేదనిపిస్తుంది, ఒక్క ధనంలోతప్ప నీతో దేనికి సరిపోతాను ? రాణి తప్పుకూడా లేదు. నీఅందం, రచనా వ్యాసంగం ఆమెని ఆకర్షించినై. ఇక డబ్బు విషయం అంటావా? ఆమెకు అది పుష్కలంగా ఉంది."

మాధవ్ అచేతనుడయ్యాడు.

"మాధవ్! నిజంగా మనస్ఫూర్తిగా చెప్పు, నీవు ఆమెను ప్రేమిస్తున్నావా ? ఆమె ధనంచూచి ఆకర్షితుడవయ్యావా ! డబ్బే కావాలంటే నేను ఎంతైనా ఇవ్వ గలనురా ! కానీ నేను ప్రాణప్రదంగా ప్రేమించిన నా రాణికి అన్యాయం చేయను"

"పొద్దుపోయినట్లుంది ఇకవెళదామా"

"మరి నే నడిగిన దానికి సమాధానం"

"రేపు చెపుతాను"

* * *

"రాధా ! సాయంత్రం ఒక్కసారి మీరు మారూంకి రాగలరా ?"

అటెండెన్సు రిజిష్టరులో సంతకం చేస్తున్న రాధారాణి ఈ కొత్తపిలుపుకి ఉలిక్కిపడి వెనుదిరిగింది. మాధవ్ నిల బడి ఉన్నాడు.

"తప్పక వస్తారు గదూ" మాధవ్ అభ్యర్థన.

"ఏమిటివిశేషం ? మాబావ ఉన్నాడా!

ఈమధ్య బొత్తిగా కనబడటం మానేశాడు"

"వివరాలు తరువాత చెబుతాను. మీరుమాత్రం దయచేసి తప్పక రావాలి. ఏమంటారు."

"సరే".

రాధారాణి మాధవ్‌లు వచ్చేసరికి చక్రపాణి అప్పుడే బయటకు రాబోతున్నాడు రాణిని చూచికూడా ఏమీ పలుకరించలేదు.

"పాణీ ! ఎక్కడికివెళుతున్నావు ?"

"పనుంది బయటకు వెళ్ళొస్తాను."

"కూర్చో! తరువాతవెళ్ళొచ్చు. నిన్న నీ వడిగిన ప్రశ్నకు సమాధానం కావాలిగా"

"ఏం చెబుతావు ? "

"రాధారాణి ! మీరు చెప్పండి. నన్ను ప్రేమిస్తున్నారా ? ఏం ? అలా తెల్లబోతారేం ? నా ముఖం చూచి నిజం చెప్పండి ! మీరు నన్ను ప్రేమిస్తున్నారా !......... అవును మీకు ఆశ్చర్యంగానే ఉండొచ్చు. ఏమిటి ఈ విపరీతపు ప్రశ్న అని. సరే మీరు నన్నుఅడగండి. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానా అని!"

"...................."

"ఏనండి. చెబుతున్నాను, నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. ఎలా అంటారేమో ? ఒక మంచి నేస్తురాలిగా మాత్రమే. మరే ఇతర నీచభావంతోనూ గాదు."

చక్రపాణి, రాధారాణి, మాధవ్ ధోరణికి విసుబోయి ఒకరి ముఖంలోకి మరొకరు చూచుకోలేక పోయారు.

"మాధవ్! ఏమిటిరా నువ్వుచేస్తున్న పని! మందుగానీ ఏమైన ఒక చుక్క వేశావా ! నేను నీతో ఏదో అంటే మళ్లా నన్ను అవమాన పరుస్తున్నావు నువ్వు"

"రాణీ, నాబాధ నీకు అర్థంకాదు. నాకు అడ్డురాకు. చెప్పనీ! అనుమానం అనేది ఒక పెనుభూతం. అది నిన్ను పూర్తిగా ఆవరించింది. కనుక నీ ఎదుటే దాన్ని తొలగించేస్తాను. లేకపోతే రెండు నిండు జీవితాలకి శాంతి సౌఖ్యాలు లేకుండా పోతాయి."

రాధారాణి ఆశ్చర్యపోయి చిత్తరువులా తయారైంది. వీళ్ళ సంభాషణ చూస్తుంటే తల గిర్రున తిరుగుతున్నట్లనిపించింది. అయినా ఎలాగో తమాయించుకొని కూర్చుంది.

మాధవ్ గది మూలగా వెళ్ళి నుంచున్నాడు. రెండు చేతులూ తాటిస్తూ చెప్పేడు అతని గుండెల్లోంచి వచ్చేమాటలు అటు పాణినీ, ఇటురాధనీ కదిలించి వేశాయి.

"నేను కథలు రాసే మనిషినైతే కావచ్చు, నే చెప్తున్నది కథకాదు పాణీ నా జీవితం. డబ్బున్న మనుషులు వాళ్ళ అధికార బలంతో తినేస్తున్న బంగారు జీవితం. అనగా అనగా ఒక మాధవరావు వాళ్ళూరులో వసంతని ప్రేమించాడు. వసంత ఒకానొక డాక్టరు కోదండ రామయ్యగారమ్మాయి. ఆ డాక్టరుగారికి మాధవరావువాళ్ళ నాన్నగారికి మంచి స్నేహితం ఉండేది. అంచేతనే వసంత మాధవరావు హృదయాన్ని పూర్తిగా ఆక్రమించేసుకుంది. ఓనాడు, దారుణమైనరోజు మాధవరావు నాన్నగారిని కడుపున పెట్టుకుంది. ఆయన పోయిన

దుఃఖాన్ని మాధవరావు మరిచేలోగానే వసంత పెళ్ళి ఎవరో ప్లీడరుగారితో జరిగిపోయింది. 'ఇది అన్యాయం' అన్నాడు మాధవరావు. కాదు 'పచ్చి న్యాయం' అన్నాడు డాక్టరు. ఆయన గొప్పన్యాయం తెలిసిన మనుషులు. అందుచేతనే మాధవరావుకి ఒక చక్కటి ఉద్యోగం వేయించారు. అతని అభిమానం రెండోమాటు దెబ్బతిన్నది. మాధవరావు డాక్టరుగారు వేయించిన ఉద్యోగంలోచేరి ఉద్యోగి అయ్యేడు. దరిమిలా మాధవరావుని శ్రద్ధగా చూడమని అతని తాలూకు ఆఫీసరుని హుకుంజారీచేశారు డాక్టరు. యమదర్మరాజులాంటి ఆఫీసరు మాధవరావుని ఆదరిస్తున్నాడు. దీంతోవ్యక్తిగా మాధవరావు చచ్చేంత దుస్థితిలోకి దిగజారేడు. అతనికి ఓదార్పు కావాలి. అడుగడుగునా డాక్టరు చేసే మాయకి ఉపశమనం దొరకాలి. దొరికింది. ఒకటి పాణి, రెండు రాధ. వాళ్ళ పరిచయ భాగ్యంతో మనసుకి తగిలే గాయాన్ని మరిచేందుకు ప్రయత్నిస్తున్న మాధవరావుమీద విధి కసి కట్టిందోయ్ పాణీ. అందుచేతనే అమృతప్రాయమైన నీ హృదయంలో నా ద్వారా ఓ తుఫాను చెలరేగింది. దేవతలాంటి రాధను నా మూలంగా అనుమానించేవ్. కాని పాణీ! దైవసాక్షిగా చెబుతున్నాను. వసంతని ప్రేమించిన నేను మళ్ళా మరో వసంతలాంటి మనిషిని ఈ జన్మలో ఎంచుకోలేను. నేను చాలా దౌర్భాగ్యుణ్ణి మన్నించు. నేను మీ యిద్దరికి ఏమి కాను. కేవలం మాధవరావుని, గుమస్తా మాధవరావుని, ఒకళ్ళ దయాధర్మాల మీద బతుకుతున్న అతి సామాన్య మాధవరావుని. మైనేమ్ ఈజ్ మాధవరావు ఓన్లీ! పూర్ మాధవరావ్—"

మాధవ్‌లోని అసహాయత. దుఃఖం పెల్లుబికి అతన్నింక మాట్లాడనివ్వలేదు. చేతుల్తో మొఖాన్ని కప్పేసుకున్నాడు.

ఆ గదిలో నిట్టూర్పు నిలిచిపోయింది.

